# పద్మనయన

ఆనంద్ ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నాడు. సాధారణంగా ప్రేమ విఫలమైతే అలాంటివాళ్ళు ఆత్మహత్త చేసుకొడమో, లేకపోతే తాగడం మొదలు పెట్టి దేవదాసుల్లా మారి పోవడమో చేస్తుంటారు. ఆనంద్ తాగాలని ఒకసారి ప్రయత్నించాడు, ఒక్క గుక్క తాగేసరికి గొంతు భగ భగ మండిపోయి, కళ్ళ వెంట నీళ్ళు కారాయి. ఆ వాసన కడుపులో తిప్పింది. అబ్బ తాగేవాళ్ళు ఎలా తాగుతారా అన్పించిందతనికి. మొదటి ప్రయత్నం లాభంలేదని రెండోది ప్రయత్నిద్దామని చిన్న పాయిజన్ సీసాకొన్నాడు. నోట్లో వేసుకోగానే చావడం ఖాయం. ప్రేమ విషయంలో ఓడిపోయాక బ్రతికివుండి లాభంఎమిటి అనుకన్నాడు.

జీవితం అంటే ఆదంద్‌కి పిచ్చిప్రేమ ఏంలేదు. ఈ ఇరవై ఐదేళ్ళ వయస్సులో చాలా జీవితమే చూసాడు. చెల్లని నాణాన్ని యిటు అటు తిప్పిచూసినట్లు జీవితాన్ని కూడా రెండు వైపులా చాలాసార్లు చూశాడు. ఒకవైపు చీకటి, మరోవైపు వెలుగు, శాంతితో తనుజీవితం పంచుకోగలిగివుంటే తన చీకటి జీవితానికోవెలుగుకిరణమయ్యేది. ఆమె కాని అలా జరగలేదు... తన పరిచయం ప్రేమగా మారిన ఏడాదికి... ఆరోజు... ఆనంద్, నీవు ఆరునెలలలోగా ఏదన్న ఉద్యోగం సంపాదించలేకపోతే నా పెళ్ళి మరొకరితో అయిపోతుంది ఓ నిరుద్యోగిని చేసుకోవడానికి మానాన్న చచ్చినా వప్పుకోరు... అలా అడగలేనునేనసలు, అంతకంటె సిగ్గుచేటు విషయం మరోటి లేదు - ఆనంద్ ఆడదాన్ని ప్రేమానురాగాలు లభించాలంటే పురుషుడు యోగ్యుడు అయి వుండాలి. ఉద్యోగం అన్నది మొదటి యోగ్యత ఆర్జనపరుడు కాని పురుషుడ్ని ఏ స్త్రీ మనస్ఫూర్తిగా ప్రేమించదు నీవు ఏదో ఉద్యోగం వెంటనే చూడు?' అంది ఖచ్చితంగా.

ఉద్యోగం కోసం చూస్తూనేవున్నాడు ఆనంద్ పెట్టని అప్లికేషన్‌లేదు. తిరగని ఆఫీసులేదు, అడగని పెద్దమనిషి లేడు. ఆయినా లాభంలేక పోయింది.. ఆర్నెల్లు గడిచిపోయాయి. శాంతిని తన ప్రేమ సామ్రాజ్యానికి రాణిని చేసుకోగల నన్న విశ్వాసం అడుగంటి పోతుంది. ఆ కోరిక అణగారి పోయింది. శాంతి ఒక ఐ.ఎ.ఎస్ ఆఫీసర్ని పెళ్ళాడింది. ఆఖరికి పెళ్ళికికూడా పిలవలేదు.

ప్రేమ విఫలమయిన దానికంటే, ఒక ఆడదాని చేత తిరస్కరింపబడిన అవమానం ఆత్మికతకి ప్రోత్సహించింది. చేతిలోని విషం సీసామరోసారిచూసాడు ఆనంద్ – మనసంతా శాంతి పట్ల కోపంతో, కసితో నిండిపోయింది ఇవాళతను నిరుద్యోగి కాని రేపంటూ వుందిగాయివాళరాకపోతే కొన్నాళ్ల కయినా ఏదో ఉద్యోగం దొరక్కపోయేదా? శాంతికొన్నాళ్ళు తనకోసం ఆగలేకపోయిందా! నిజంగా ప్రేమించి వుంటే ఆ మాత్రం తనకోసం నిరీక్షించలేక పోయేదా, తన భవిష్యత్తుమీద ఆ మాత్రం నమ్మకం లేక పోయిందా తనకి 'రేపు' మీద విశ్వాసం వుంచి రేపటికోసం ఆగలేకపోయిందా! అలాంటి ఆడదానికోసం తను చచ్చిపోవాలనుకుంటున్నాడు.

ఆలోచనలమధ్య... రూములోకి పోస్ట్‌మేన్ విసిరేసిన కార్డు చూశాడు. అతని మొహంలో వెయ్యి కాంతులువచ్చాయి. ఏదో ఫారెన్ కంపెనీలో ఉద్యోగం కోసం ఎప్పుడో అప్లై చేసిన దానికి యింటర్వ్యూకి రమ్మని యిప్పుడు పిలుపు! సెలక్ట్ అయితే ట్రైనింగ్ కోసం ఫ్రాన్స్ వెళ్ళాల్సి వుంటుంది. ఆ కార్డు చూస్తుంటే నమ్మకం కల్గకపోయినా.. ఆత్మహత్య ఎప్పుడన్నా చేసుకోవచ్చు – కాని ఉద్యోగం అలా కాదుగా, ఏమో ఎవరికి తెలుసు, తన జీవితంలో చీకటిమీద ఫ్రాన్స్‌లో సూర్యుడు తన వెలుగు కిరణాలని ప్రసారిస్తాడేమో – ఆ ఆశతో ఆనంద్ ఆత్మహత్య ప్రయత్నం వాయిదా వేసాడు.

కలకత్తాలో యింటర్వ్యూ – అది కలకత్తా నగరం – ఒకరిద్దరు తెల్సిన మిత్రులున్నా – తనున్న పరిస్థితిలో వాళ్ళు చూపే సానుభూతి భరించలేడు అందుకే ఖర్చయినా సరే ఒక రోజుకోసం మంచి హోటల్లోదిగాడుదిగాడు – ఫారెన్ కంపెనీ ఇంటర్వ్యూకి వచ్చి కాస్త ఖరీదయిన హోటల్లోనే దిగడం మంచిదని పించింది. రూమ్‌లో సౌకర్యాలతో పాటు ఫోనూవుంది.

ఉదయం పదకొండున్నరకి యింటర్వ్యూ పూర్తయింది. బాగానే చేసాననిపించింది. ఆనంద్‌కి – యింటర్వ్యూ సెలక్షన్ బోర్డు కమిటీ మెంబర్లలో ఒకతను ''ఒకవేళ మీరు సెలక్షన్ అయితే, మీ పోస్టింగ్ ఫ్రాన్స్‌లో అయితే శాశ్వతంగా మీరు అక్కడ వుంటారా? అందుకేమన్నా అభ్యంతరం వుందా?

అనడిగాడు ఆఖర్న, ఆనంద్ ఒక్క క్షణం ఆలోచించి... ''ఇండియా అయినా, ఫ్రాన్స్ అయినా ఏ దేశం నాకు అన్నం పెడితే ఆ దేశంమే మాతృదేశంగా భావించగ లను అక్కడ సెటిల్ అవడానికి నాకేం అభ్యంతరంలేదు''. అని జవాబిచ్చాడు. ఆ జవాబు ఛైయిర్‌మన్ గార్కి సంతృప్తి నిచ్చిందనిఅతని మొహమే చెప్పింది.

ఇంటర్వ్యూ పూర్తయి హోటలురూమ్‌కి వచ్చి విశ్రాంతిగా పడుకున్నాడు.

ఆ ఉద్యోగం అతనికి వస్తుందని ఎందుకో అనిపించసాగింది అతనికి. అతని ఆలోచనలని తుంచేస్తూ రూములో ఫోనుమోగింది రూములో ఫోనువున్నా హోటలువాళ్ళు తప్ప తనకెవరు చేస్తారు. యిక్కడ తమన్నట్టుయింకెవరికి తెలుసు అనుకంటూ నిర్లిప్తంగా ఫోను తీసాడు - 'మీకు ఫోనువచ్చింది రిసీవ్ చేసుకోండి' అంది రిసెప్షనిస్టు. తనకి ఫోను ఎవరు చేస్తున్నారు? హోటల్ ఎడ్రస్ ఎవరికి తెలుసు? కంపెనీ వాళ్లా! తనకి ఉద్యోగం యిస్తున్నట్టు నిర్ణయించి చెపుతున్నా రేమో. ఒక్క క్షణం గుండె లయతప్పింది ''హలో'' అన్నాడు ఆరాటంగా.

''హల్లో, మిస్టర్ ఆనంద్...'' అవతలనించి ఒక మృదువైన ఆడగొంతు. నా పేరు పద్మనయన... ఆనంద్ ఆశ్చర్యపడ్డాడు. ఎవరీ పద్మనయన ఎంత ఆలోచించినా ఆపేరు ఎప్పుడో విన్నట్టులేదు. అవతలనించి స్త్రీ కంఠం వినగానే ఆనంద్‌కి శాంతి మనసులో మెదిలింది. తన పిచ్చిగాక పోతే శాంతి కలకత్తాలో ఎందుకుంటుంది. ఆమె భర్త హైదరాబాదులో ఐ.ఎ.ఎస్ ఆఫీసరు. హఠాత్తుగా కలకత్తా వచ్చి తనని ఎందుకు పలకరిస్తుంది!

అవతలవైపునించి మళ్ళీ పద్మనయన కంఠస్వరం మృదు తరంగాలని సృషిస్తూ ''నేను మీ హోటలుకి రావచ్చా? మీతొ అర్జంటుపనివుంది అంది. ఆనంద్‌కి యిదంతా ఏమిటో అంతు బట్టలేదు. ఈ పద్మనయన ఎవరసలు ఒక అపరిచిత స్త్రీకి తనతో ఏమిటిపని. అతను సమాధానం చెప్పగానే ''యిప్పుడే అరగంటలో వస్తున్నాను. ప్లీజ్ వెయిట్'' అంటూ ఫోనుపెట్టేసింది, ఆనంద్ మనసంతా ఉద్వేగంతో నిండిపోయింది. ఈ కొత్త చోట తన ఉనికి తెలుసుకున్న ఈ స్త్రీ ఎవరు?

శాంతి తిరస్కృతితో అతనికి ప్రేమ వ్యవహారాలంటే భయం పట్టుకుంది. ఆ విషయంలో మరిచిపోలేని పాఠం నేర్చుకున్నాడు. ఇప్పుడింక ఏస్త్రీ కోసం నిరీక్షించ డానికి అతనికి ఓపిక టైము రెండోకూడాలేవు - ఆ కాలాన్ని యింకేవిధంగానైనా సద్వినియోగం చెయ్యాలనుకున్నాడు. మళ్ళీ యీ గొడవ ఏమిటో ఈమె ఎవరో, తనతో ఏంపనో ఎంత ఆలోచించినా అంతుబట్టలేదు.

''నేను లోపలికి రావచ్చా'' గుమ్మం దగ్గర మాటవిని ఆలోచనలనించి తేరుకుని చటుక్కున తల తిప్పి చూశాడు. సమాధానానికి ఎదురు చూడకుండానే

లోపలికివచ్చిందామె. అరే - యీ చట్టిముక్కు, చీపికళ్ళ నల్లపిల్ల... యీమెని తను ఉదయం యింటర్వ్యూలో చూశాడు. అప్పుడుయింగ్లీషు బెంగాలి అంత అనర్గళంగా మాట్లాడుతూంటే తెలుగు పిల్లనుకోలేదు అసలు. ఆమె లోపలికివచ్చి నాపేరు ''పద్మనయన'' అంటూ పరిచయం చేసుకుంది. ఆ రూపుకి ఎక్కడా పొంతన కనిపించ లేదతనికి - ఈ చిలిపి కళ్ళ పిల్ల పద్మనయనా: పద్మానికున్న రంగు, కోమలత్వం అన్నాలేదు. ఆ అమ్మాయిని చూసి మర్యాదగా కుర్చీలోంచిలేచి ఆహ్వానిస్తూ కుర్చీచూపి కాఫీ ఆర్డర్ చేశాడు - 'నేను మీకేం చెయ్యగలను'' మర్యాదగా అడిగాడు. ఆమె చిన్నగా నవ్వి - ''మీరు నాకు ఒక ఫేవర్ చెయ్యాలి, అది అడగటానికి వచ్చాను - ఆ, ముందు నా అభినందనలు అందుకోండి, ఇంటర్వ్యూలో ఫస్ట్ వచ్చినందుకు అంది ఆనంద్ నమ్మలేనట్టుచూస్తూ'' నిజంగా, ఒక వేళ నిజమే అయితే యింత శుభవార్తని అందించినందుకుమీకు నిజంగా కృతజ్ఞుడిని'' అన్నాడు ఆనందాన్ని దాచుకోలేక -

కాని పద్మనయన ఆకృతజ్ఞతలు అందుకోలేదు అసలు ఆమె మొహంలో ఏభావం కనబడలేదు. నిర్లిప్తంగా చూస్తూ.. ''మీరు నాకు ఒక ఉపకారం చెయ్యాలి - ఈ ఉద్యోగాన్ని మీరు నా కోసం వదులుకోవాలి. మీరు ఆకంపెనీ డైరెక్టర్ గార్కి ఫ్రాన్స్‌లో పోస్టింగ్ అయినందువల్ల ఈ ఉద్యోగానికి ఇష్టపడడంలేదని నాకు రాసి యివ్వండి'' - అంది చాలా మామూలుగా - ఆనంద్ తెల్లపోయాడు. ఆ అమ్మాయి ఏమంటున్నదీ ఒక్క క్షణం అర్థంకాలేదు అర్థమయ్యాక అతను తీక్షణంగా చూసాడు. ''ఏమిటీ అమ్మాయి ఉద్దేశం, తన ఉద్యోగం వదులు కోవాలా, పిచ్చిగాని ఉందా ఆమెకి లేక తనని పిచ్చివాడనుకుందా? ఈ అమ్మాయి కేం తెల్సుతను ఉద్యోగంకోసం ఎన్నాళ్ళుగా ఎదురుచూస్తున్నాడో - తనకీ ఉద్యోగం ఎంతఅవసరమో - అయినా ఎలావదులుకంటాడని ఆమెఉద్దేశం ''నేను ఫ్రాన్స్‌లో పోస్టింగ్ అయినా వెడతానని ముందే చెప్పాను - '' ''తీక్షణంగా చూస్తూ కరకుగా అన్నాడు. ఆ అమ్మాయి అదేం పట్టించుకోనట్టుగా నవ్వుతూ... ''మరేం పరవాలేదు, యిప్పుడు మళ్ళీ వెళ్ళను అనిరాసిచ్చేస్తే కంపెనీ వాళ్ళేంకొట్టరు మనల్ని - '' ''చిన్న పిల్లలా మారాంచేస్తున్నట్లందిఏమిటి అమ్మాయి ఉద్దేశం, వేళా కోళమా యిది, ఎంతో చనువున్నట్లు మాటలేమిటి!

''నాకు తెలుసు, నేను యిలా అడగడం ఎంతో అన్యాయం, అను చితమూ అని - మీకు ఈ ఉద్యోగం ఎంతో అవసరం అనుకుంటాను కానీ నాకీ ఉద్యోగం రాకపోతే జీవితంలో చాలా నష్టపోతాను. ఈ దేశానికి దూరంగా ఈ మనుష్యులకి - ఈ స్వార్థ పరులకీ దూరంగా లేకపోతే నాకు పిచ్చెక్కుతుంది ప్లీజ్ మిష్టర్ ఆనంద్!

రైళ్లలో బస్సుల్లో లేడీస్ ఫస్ట్ అంటూ చోటు యిచ్చి మీరు నిలబడుతుంటారే, అలాగే ఈ ఉద్యోగం నాకీయడానికి మీరు కొంచం జరగలేరా - నేను యింట ర్వ్యూలో సెకండ్ వచ్చాను; మీరు అజాబ్‌కి వప్పుకుంటే నాకీ ఉద్యోగం రాదు - ప్లీజ్, ఆ ఉద్యోగం నాకిచ్చి సహాయమడరా.. '' జాలిగా అడిగింది -

ఆనంద్ సంకటపరిస్థితిలో పడిపోయాడు. ఉద్యోగం కోసం వెతికి వెతికి వేసారిపోయాక దొరక్క దొరక్క దొరికిన యీ ఉద్యోగాన్ని ఎవరో ముక్కు మొహం తెలియని పిల్లమీద జాలిపడి వదలాలా? ఆ అనాకారి పిల్ల మొహంలో దైన్యం చూస్తుంటే గట్టిగా వద్దు, వీల్లేదు అని చెప్పాలనుకున్నా, చెప్పలేక పోతున్నాడు.

కాఫీ వచ్చింది. పద్మనయనలేచినిల్చుంది. ''మీరు ఆఫర్ చేస్తున్నా కాఫీ తాగనందుకు ఏమి అనుకోకండి. మీరు నా అభ్యర్థనని అంగీకరిస్తే యిదిగో నా యీ హోటలు నంబర్‌కి ఫోను చెయ్యండి'' అంటూ చెప్పి చకచక వెళ్ళిపోయింది, ఆనంద్ కేం మాట్లాడడానికి అవకాశం యీయకుండా.

ఆ తరువాత ఆనంద్‌కి ఫోమ్ పరుపుమీద పడుకున్నా కంటిమీద కునుకురాలేదు. మాటిమాటికి అతని కళ్ళముందు యిద్దరమ్మాయిల మొహాలు నాట్యం చేశాయి. మొదటిదిశాంతి, రెండోది పద్మనయన! శాంతి అందమైనది. రెండేళ్ళ పాటుతనని మురిపించి మరపించింది. రెండోది రెండు గంటల కింద ముఖ పరిచయమైనాలేని పద్మనయనది కావాలంటే తన తిరస్కృతి ఖచ్చితంగా ఆ అమ్మాయికి చేప్పేయవచ్చు. కాని ఆ సంగతి వినగానే ఆ అమ్మాయి నల్లటి మొహం మరింత నల్లబడుతుంది. ఆ నల్లటి మొహంలో తెల్లటి కళ్ళల్లో నిరాశని ఊహిస్తుంటే ఏదోలా అన్పించిందతనికి. ఏ ఆశతో, ఏ నమ్మకంతో, ఏ భరోసాతో తన నీ కోరిక కోరింది! ఇంతమంచి జాబ్ ఓ ముక్కు మొహం తెలియని అమ్మాయి కోసం ఎలా వదులుతాడని అడిగింది. ఆ అమ్మాయికీ ఉద్యోగం అంత అవసరమేమిటి? ఈ దేశానికి, స్వార్థపరులకి దూరంగా పోవాలంది. ఏంజరిగి యింత విరక్తి పుట్టింది ఆమెలో. అన్న ప్రశ్నకి ఏది సరిగా చెప్పకుండా వెళ్ళిపోయింది ఆమె. యిప్పుడు తనేంచెయ్యాలి.. ఏది ఏమైనా ఈ ప్రపంచంలో ఒక స్త్రీ తనస్వార్థానికై తేనేం, మరి దేనికయితేనేం తనమీద యింత నమ్మకం, విశ్వాసం వుంచి అడగడం ఆనంద్‌కి చాలా సంతోషంగా తృప్తిగా వుంది ఆమెనమ్మకాన్ని తానువమ్ము చెయ్యకూడదు... శాంతి తిరస్కృతి తనకి ఎలాంటి గాయాన్ని రేపిందో తనకితెలుసు. అలాంటి గాయాన్ని పద్మనయన గుండెల్లో రేపాలంటె మనసు వప్పడంలేదు. హఠాత్తుగా అతనికి ఆ అమ్మాయంటే ఏదో మక్కువ జన్మించింది హృదయంలో. పోనీ యీ అమ్మాయికి అవసరంలో ఆదుకుని సహాయం చేసానన్న

తృప్తి తనకి దక్కుతుందేమో! ఈ జీవితంలో ఎవరికీ ఉపకారం చేసే అవకాశం దొరకకపోవచ్చు. పోనీ ఈ ఆ అమ్మాయి జీవితం బాగుపడనీ, యిప్పుడీ ఉద్యోగం దొరికిందన్న సంతోషం పంచుకుని తనతో జీవితం పంచుకోవడానికి శంతి సిద్ధంగా లేదు. అలాంటప్పుడు మరికొన్నాళ్ళు నిరుద్యోగిగా వుంటే ఏం పోయింది కనీసం, ఆ అమ్మాయిని అదృష్టవంతురాలినిచేసి సంతోషిస్తాడు.

సామాను సర్దుకుని, కంపెనీ డైరెక్టర్‌కి తనకా ఉద్యోగం అక్కరలేదని ఉత్తరం రాసి కింద రిసెప్షనిష్టుకిచ్చి. పద్మనయనకి ఫోనుచేసి ఆ విషయం చెప్పి ఆమె చెప్పే కృతజ్ఞతలు వినకుండానే ఫోను పెట్టేసి స్టేషనికి వెళ్ళాపోయాడు.

రైలు బయలు దేరడానికి పదిహేను నిమిషాలుండాగా పరిగెడ్తూ - పరిగెడ్తూ కంపార్టుమెంటు వెతుక్కుంటూ వచ్చి ఆనంద్‌ని పట్టుకుంధి పద్మనయన, ''వెళ్లేముందు కనీసం కృతజ్ఞతలైనా చెప్పే అవకాశం నాకీయకుండా నన్ను కృత ఘ్నురాలిగా చేదామనుకున్నారా-కనీసం నేనెందుకీ ఉద్యోగం కావాలనుకున్నానో అదైనా చెప్పకుండా ఎలా వెళ్ళనీయగలననుకున్నారు ఆ తర్వాత నేను శాంతిగా వుండగల ననుకున్నారా. నిష్ఠూతంగా అంది. '' కారణాలు ఎందుకు నాకు చెప్పి ఏం ప్రయోజనం వుంది నేను ఇది వరకు చాలా ఉద్యోగాలకి వెళ్ళాను. అని రాలేదు - ఇదీ అలాగే అనుకుంటాను. నిర్లిప్తంగా అన్నాడు. ఆనంద్.. ''మీ సమస్యకీ ఉద్యోగంవల్ల తీరితే అంతేచాలు.''

''నేనీ ఉద్యోగం డబ్బుకోసం చెయ్యాలనుకుంటున్నాను కున్నారా! మా నాన్నగార్కి డబ్బుకేం కొదవలేదు-'' ఆనంద్‌కి ఒక్క క్షణం తనత్యాగం వ్యర్థ మైందన్న భావంతో నిరాశ కల్గింది.. ''మరి? - టైమ్ పాస్‌కా?'' ఆశ్చర్యంగా అడిగాడు.

''వూహు... అదీ కాదు -- చూడండి ఆనంద్‌గారూ -- మీరు ఫ్రాన్స్ వెళ్ళినా మాతృదేశంగా భావించ గలనన్నారు గాని నా కెప్పుడూ ఫ్రాన్స్ విదేశమే - అయినా మాతృభూమి వదిలిపెట్టాలనిపించిందంతే''

ఆ అమ్మాయి చెప్పేదేమిటో అర్థంకాక అయోమయంగా చూవాడు. ఆమె తర్వాత ఐదునిమిషాలలో గబగబ చెప్పిన సంగతి విన్నాకజాలేస్తుంది. పూటకి గతి లేని స్థితిలో యిల్లుచేరి, తమవుప్పుతిని చదువు సంధ్యలు చెప్పించాక ఐ.ఎ.ఎస్. పాసయ్యాక ఏరు దాటాక తెప్పతెగలేసిన రకం మనిషితో ఆమె జీవితం ముడి పడాల్సి వుండేది. యింట్లో వుంటూ పదేళ్ళుగా కనపడని ఆమె అందవికారం. ఐ.ఎ.ఎస్. అవగానే ఒక్క సారి కనపడి. ఆమెని తప్పించుకుని, ఎదుట పడి

నిజాయితీగా, నిర్భయంగా మనసులో మాటచెప్పే ధైర్యం లేని పిరికిపంద అయి చాటుగా యింకెవరో అందగత్తెని పెళ్ళాడిన ఆ నయవంచకుడిని ఆమె క్షమించలే కపోయింది. కూతురు కోసమే ఆ గతిలేనివాడిని యింటపెట్టుకుని చదువు సంధ్యలు చెప్పి,చి ప్రయోజకుడిని చేసి పెళ్ళిచేయాలనుకన్న ఆ తండ్రి అతనుచేసినమోసాన్ని చూడలేక గుండాగి మరణించాడు. కన్న తండ్రి ఏకాకి చేసివదిలాక, కట్టుకోవలసిన వాడు కాలదన్నాక ఆమె కింకయిక్కడేం మిగలలేదని... ఆస్వార్ధపరుడి ఆలోచనలు కూడా దూరలేనంత దూరం వెళ్ళాలని నిర్ణయించు కుంది ఆమె. ఫారెన్ ఛాన్స్ వుండే యీ ఉద్యోగానికి ప్రయిత్నించింది. ఆనంద్ అనుమానంగా అతని పేరడిగాడు. ఆమె చెప్పిన పేర్లు విన్నాక , మిగతా వివరాలు తెలిశాక... ఆ క్షణంలో ఆనంద్ మనసులో ఏదోకసి, ద్వేషం - కల్గాయి - ఆక్షణంలో పద్మనయన ఎంతో ఆత్మీయురాలిగా కన్పించింది. అందం అన్నది బాహ్య సౌందర్యమే కానక్కరలేదన్నది ఆక్షణానే తట్టింది.. అతనింకేం ఆలోచించలేదు... అమెవంక చూసి చటుక్కున పెట్టెపట్టుకు కిందకు దిగాడు.''ఊహు - ఈ ఉద్యోగం నేను మీకీయను...'' అన్నాడు తెల్లపోయి చూస్తున్న ఆమెతో...

''అదేమిటి - '' పాలిపోయిన మొఖంతో ఆరాటంగా చూస్తూ అంది. ఈ నాకథ వింటే జాలిపడి మీరు నాకీఉద్యోగంయిచ్చి విదేశం వెళ్ళడానికి ఎంత సాయంచేసారో అర్థం చేసికుంటారని చెప్పాను. మీరు మనసెందుకు మళ్ళీ మార్చుకున్నారు - ప్లీజ్ ఫారిన్ వెళ్ళే ఛాన్సుండే ఉద్యోగం నాకు దక్కనీ యండి -'' ప్రాధేయపడ్తూ జాలిగా అంది.

''ఫారెన్ వెడతారు మీరు...'' అతని కళ్ళల్లో ఏదో మెరుపు...

''ఎలాగా? - ఉద్యోగం యివ్వనన్నారుగా--?''

''ఈ ఉద్యోగినిగా కాదు - ఈ ఉద్యోగ సహచరిణిగా మీరు ఫ్రాన్స్ వెడతారు...

రెండు పాస్ పోర్టులు కావాలి మనకు అని చెప్దాం కంపెనీ వాళ్ళకి - ఈ లోగా రిజిష్టర్ ఆఫీసులో పేర్లు నమోదు చేయించుకుందాం - పద్మ ఏలా ఉంది? -- టూబర్డ్స్ ఎట్ ఎ షాట్...'' చిలిపిగా నవ్వుతూ చూశాడు ఆమెవంక - నల్లని ఆమె ముఖం కమలం రంగులోకి మారింది ఆక్షణాన.

(ఆంధ్రప్రభ వీక్లీ - 1968)